నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 20 జూన్ 2024 SANGAREDDY

ఆరేండ్ల తర్వాత తెలిసిన కొడుకు జాడ

కంది, జూన్ 19 : ఫిలిప్పీన్స్ దేశానికి వెళ్లి ఆరేండ్లుగా ఆచూకీ తెలియని అరుణ్‌రెడ్డి జాడను సంగారెడ్డి జిల్లా పోలీసులు కనుగొన్నారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ ప్రత్యేక చొరవతో మిస్సింగ్ పర్సన్ అరుణ్‌రెడ్డి కేసును ఛేదించారు. కొడుకు జాడతెలియక ఆందోళనకు గురవుతున్న తల్లి సత్యాగామ మణెమ్మతో ఫిలిప్పీన్స్ దేశ నుంచి అరుణ్‌రెడ్డితో బుధవారం ఫోన్‌లో మాట్లాడించారు. సంగారెడ్డి జిల్లా కంది గ్రామానికి చెందిన సత్యాగామ మణెమ్మ కుమారుడు అరుణ్‌రెడ్డి 2012లో ఎంబీబీఎస్ చదువు కోసం ఫిలిప్పీన్స్ దేశంలోని మాకాటి సిటీకి వెళ్లాడు. 2018లో తండ్రి చనిపోతే కంది గ్రామానికి వచ్చి తిరిగి మళ్లీ ఫిలిప్పీన్స్ వెళ్లిపోయాడు. అక్కడికి వెళ్లినప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడం, ఫోన్‌లో మాట్లాడకపోవడం, ఫోన్ చేసినా లేపకపోవడంతో కుమారుడికి ఏమైందోనని తల్లి మణెమ్మ ఆందోళనకు గురైంది. ఆరేండ్ల నుంచి కొడుకు ఆచూకీ లేదని ఈనెల 10న జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి తన బాధను ఎస్పీకి విన్నవించింది. స్పందించిన ఎస్పీ వెంటనే ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలివ్వగా, మిస్సింగ్ పర్సన్ అరుణ్‌రెడ్డి పాస్‌పోర్ట్, ఫోన్ నంబర్, ఫొటోస్ ఆధారాలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ ఫిలిప్పీన్స్ ఎంబసీతో మాట్లాడి వారి సహాయంతో అరుణ్‌రెడ్డి ఆచూకీ తెలుసుకొని తల్లి మణెమ్మతో ఫోన్‌లో మాట్లాడించారు.

కాసులకు రైతుల ఇక్కట్లు..!

■ జాడలేని రైతుభరోసా ■ రుణమాఫీ కోసం అన్నదాతల ఎదురుచూపులు

- ■ వానకాలం సాగుకు చేతిలో చిల్లగవ్వలేదు
- ■ సంగారెడ్డి జిల్లాలో ఇంకా ఖరారు కాని వార్షిక రుణ ప్రణాళిక
- ■ పట్టించుకోని ప్రభుత్వం
- ■ జిల్లాలో 1.59 లక్షల ఎకరాల్లో పంటల సాగు

సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు , ట్రాక్టర్‌తో దుక్కుదున్నుతున్న రైతు

సంగారెడ్డి, జూన్ 19(నమస్తే తెలంగాణ): కాలం కలిసివచ్చినా చేతిలో కాసులు లేక సంగారెడ్డి రైతులు ఇక్కట్లు పడుతున్నారు. వానకాలం సీజన్ ప్రారంభంలోనే వర్షాలు బాగా కురుస్తున్నాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతులు చేతుల్లో పైసలు లేవు. దీంతో రైతులు పంట పెట్టుబడి సాయం(రైతు భరోసా), పంట రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. కేసీఆర్ సర్కారు ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి రైతు ఖాతాల్లో రైతుబంధు పేరిట పెట్టుబడి సాయం ఎకరాకు రూ.5 వేల చొప్పున సీజన్‌కు ఠంచన్‌గా జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు స్థానంలో రైతుభరోసా అందజేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన కానీ, మార్గదర్శకాలు కానీ జారీ చేయ లేదు. దీంతో రైతులు రైతుభరోసా ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. దీనికితోడు జిల్లాలో బ్యాంకర్లు కొత్తగా పంట రుణాలు ఇవ్వడం లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక ఖరారు కాలేదు. దీంతో కొత్త పంట రుణాలు అందక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

1.59 లక్షల ఎకరాల్లో పంటల సాగు

సంగారెడ్డి జిల్లాలో ఈనెల 18వ తేదీ వరకు 53.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కురువాల్సి ఉండగా, 93.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే 74.6 శాతం ఎక్కువగా వర్షం కురిసింది. వానకాలం ప్రారంభానికి ముందు జిల్లాలో విత్తనాల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ప్రధాన పంటలకు సంబంధించిన వరి, పత్తి, కంది, పెసర, మినుము విత్తనాలను, ఎరువులను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. జిల్లాలో వానకాలం సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 7,24,405 ఎకరాలు కాగా, రైతులు ఇప్పటి వరకు 1.59 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. 1.43 లక్షల ఎకరాల్లో పత్తి, 6,320 ఎకరాల్లో సోయా, 5,790 ఎకరాల్లో కంది, 695 ఎకరాల్లో పెసర, 590 ఎకరాల్లో మినుము, 636 ఎకరాల్లో మొక్కజొన్న, 2,440 ఎకరాల్లో చెరుకు పంటలు సాగు చేశారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురుస్తుండటంతో పంటల సాగు క్రమంగా ఊపందుకుంటున్నది.

కేసీఆర్ హయాంలో భరోసా

సంగారెడ్డి జిల్లాలో చిన్న, సన్నకారు రైతుల చేతిలో చిల్లిగవ్వలేక విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వానకాలం సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో కేసీఆర్ సర్కారు రైతుబంధు ద్వారా 3,59,010 మంది రైతులకు రూ.375 కోట్లు అందజేసింది. ప్రస్తుతం జిల్లాలోని 3.62 లక్షల మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసా పేరిట పెట్టుబడి సాయం అందిస్తామని రైతులకు హామీ ఇచ్చింది. రైతుభరోసా అమలుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాం టి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో రైతుభరోసా డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

జాడలేని పంట రుణమాఫీ..

సంగారెడ్డి జిల్లాలోని రైతులు పంట రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినా ఇప్పటివరకు పంట రుణమాఫీ చేయలేదు. రుణమాఫీ కాక, కొత్త పంట రుణా లు అందక వానకాలం సాగుకు పెట్టుబడి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా లో ఇప్పటి వరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రణాళిక ఖరారు కాలేదు. ఇదివరకే వార్షిక రుణ ప్రణాళిక ఖరారు కావాల్సి ఉన్నప్పటికీ బ్యాంకర్లు, జిల్లా యంత్రాంగం ఇంత వరకు రుణ ప్రణాళికను ఖరారు చేయలేదు. వార్షిక రుణ ప్రణాళిక ప్రకటించకపోవటంతో జిల్లాలోని బ్యాంకర్లు కొత్తగా రుణాల కోసం బ్యాంకులకు వచ్చిన రైతులను తిప్పిపంపుతున్నారు. దీంతో దిక్కుతోచక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.



సక్కగా కరెంట్ అత్తలేదు..

మిరుదొడ్డి, జూన్ 19 : కేసీఆర్ సార్ ఉన్నప్పుడు రైతులకు బాయిలకాడ 24 గంటలపాటు కరెంట్ ఇచ్చిండు. గా కరెంట్‌తో మంచిగా పంటలు పండించుకున్నాం. గీ కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక సక్కగా కరెంట్ అత్తలేదు. యాసంగిలో కాంగ్రెస్ సర్కార్ సక్కగా కరెంట్ ఇయ్యకపోవడంతో వరి ఎండి పోయింది. మా రైతులకు కరెంట్ గోసలు తప్పవు ఇగా..

-దార రాజయ్య, రైతు, మిరుదొడ్డి

కరెంట్ మంచిగ ఇయ్యాలే..

మిరుదొడ్డి, జూన్ 19 : గడికి గడికి కరెంట్ బంద్ చేయకుండా కాంగ్రెస్ సర్కారు కరెంట్ మంచిగా ఇయ్యాలే. గప్పుడూ కేసీఆర్ సార్ ఇండగా కన్ను మూసినంత సేపు కూడా కరెంట్ పోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి రాంగనే ఈ ఎండాకాలంలో కరెంట్ ఇబ్బందులతో అంటు పంటలు ఎండి, ఇంటిలో ఉండలేని గతి పట్టింది. 10 ఏండ్ల పాటు కరెంట్ పోవడం చూడలేదు, గిప్పుడైతే ఎప్పుడు పోతుందో...ఎప్పుడూ...అత్తుందో తెలుత్తా లేదు. మల్లా కేసీఆర్ సార్ అత్తనే కరెంట్ కోతలు ఉండవు.

-మద్దెల రామస్వామి, రైతు, మిరుదొడ్డి

కరెంట్ ఎప్పుడు అత్తదో ఎప్పుడు పోతదో తెల్వదు...

కొమురవెల్లి, జూన్ 19 : కరెంట్ ఎప్పుడు అత్తదో ఎప్పుడు పోతదో అస్సలు తెల్వడం లేదు. కేసీఆర్ సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాత్రం కరెంట్ అస్సలు పోనేపోలేదు. గిప్పుడు ఇంట్లో పనులు చేయాలనుకున్నప్పుడు సమయానికి కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కగంటలో ఎన్నిసార్లు కరెంట్ పోతదో దేవుడికే తెలియాలి. గతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా వచ్చిన కరెంట్ ప్రభుత్వం మారగానే ఎందుకు పోతుందో పెద్దలకే తెలియాలి.

- కొండ పార్వతి, గృహిణి, కొమురవెల్లి

కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంట్

నారాయణరావుపేట, జూన్ 19: కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు 24 గంటలు కరెంటు వచ్చేది. అప్పుడు బాయిలకాడ బోరుమోటర్లు అస్సలు కాలిపోయేవి కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంటు కరెంట్ ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతదో తెలియడం లేదు. లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతుయి రైతులు అటు ఆర్థికంగాను ఇటు పంటలు సరిగా పండక నష్టపోతున్నారు. అప్పుడు ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వమే బాగుండే.

- పిట్ల కిషన్, రైతు, గుర్రాలగుంది గ్రామం

రైతులకు నాణ్యమైన కరెంటు ఇయ్యాలే...

నారాయణరావుపేట, జూన్ 19 : నాకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు 24 గంటలు కరెంటు ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ ఇబ్బందులు తప్పడం లేదు. పంట పెట్టుబడి సాయం అందే పరిస్థితి లేదు. దీంతో రైతులంతా ఆగమవుతున్నారు. కనీసం ఈ వానకాలమైనా కరెంటు సక్కగా ఇవ్వాలి. రోజూ మెయింటెనెన్స్ పేరుతో గంటలకొద్దీ కరెంటు కట్ చేస్తున్నారు.

- చల్ల సంతోశ్, రైతు, కోదండరావుపల్లి గ్రామం

కేసీఆర్ హయాంలోనే నాణ్యమైన విద్యుత్

రాయపోల్, జూన్ 19 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అయింది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నది. చిన్నపాటి వర్షం, ఇదురుగాలులకు కరెంట్ తీస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పంటలకు సైతం అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సరఫరాలో అంతరాయంతోపాటు సమయపాలన లేకుండా విద్యుత్ తీయడంతో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. పదేండ్ల కేసీఆర్ పాలనలో రెప్పపాటు కూడా కరెంట్ పోలేదు. ఇప్పుడు కరెంట్ ఎందుకు పోతుందని ప్రశ్నిస్తే అధికారుల నుంచి సమాధానం రావడం లేదు.

- మన్నె బుచ్చయ్య, రైతు, కొత్తపల్లి గ్రామం, రాయపోల్ మండలం

కరెంట్ కోసం రాత్రి బాయిలకాడనే ఉండేది..

తెలంగాణ రాకముందు కరెంట్ కోసం నైట్ల బాయిలకాడనే ఉండేది..టిప్పుల చొప్పున కరెంట్ వచ్చేది. పొద్దుగాల నాలుగు గంటల కరెంట్, నైట్ మూడు గంటల కరెంట్ ఇచ్చేది. వచ్చిన కరెంట్ కూడా లోడ్ ఆగకుండా పోతుండే. మస్తు మాట్ల కరెంట్ కట్ అవుతుండే ఎవుసం చేయడానికి మస్తు ఇబ్బందులు పడ్డం. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ పుణ్యమా అని ఇరువై నాలుగు గంటల కరెంట్ వచ్చింది. అప్పుడు కరెంట్ కోసం ఎదురుసూసుడు లేదు. పొద్దునదాక కరెంట్ ఉంటంది ఎవుసం మంచిగ చేసుకుంటున్నం. అప్పటిలెక్కనే కరెంట్ ఉంటే ఎవ్వలూ ఎవుసం సెయ్యకపోతురు. మళ్లీ కాంగ్రెస్ వచ్చే పాతరోజులు దాపురించే...

- గంగుల రమేశ్, రైతు హుస్నాబాద్ టౌన్

24 గంటలు విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్‌దే..

రాయపోల్, జూన్ 19 : వ్యవసాయానికి 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించిన ఘనత తెలంగాణ తొలిసీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. తెలంగాణ ఉద్యమమే విద్యుత్‌తోపాటు నీళ్లు, నిధులు, నియామకాలతో జరిగింది. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ విద్యుత్‌ను 24 గంటలపాటు అందించి దేశంలోనే చరిత్ర సృష్టించారు. గతంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుంతో తెలియని పరిస్థితి ఉండేది. కేసీఆర్ హయాంలో వ్యవసాయనికి నిరంతర విద్యుత్ అందించి, రైతులను రాజుగా మార్చారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో వెనుకటి రోజులే వచ్చాయి. నాణ్యమైన విద్యుత్ రాక రైతులు అవస్థలు పడుతున్నారు.

- పడకంటి శ్రీనివాస్‌గుప్తా, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్, దౌల్తాబాద్ మండలం

మంత్రి సమక్షంలో ప్రొటోకాల్ రగడ

■ మెదక్ జిల్లా కొల్చారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట

మెదక్ జిల్లా కొల్చారంలో బడిబాట కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట

కొల్చారం, జూన్ 19 : ప్రొటోకాల్ విషయంలో బుధవారం మెదక్ జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. బుధవారం మెదక్ జిల్లా కొల్చారంలో బడిబాట కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో స్టేజీపై ప్రొటోకాల్ పాటించక పోవడంతో నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేజీపై స్థానిక ప్రజాప్రతినిధులకు స్థానం కల్పించకుండా కాంగ్రెస్ నాయకులను కూర్చోబెట్టడం ఏమిటని అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవ మొదలై తోపులాటకు దారితీసింది. ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి ఇరుపార్టీల కార్యకర్తలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకుండా గొడవకు దిగారు. జై తెలంగాణ అంటూ బీఆర్ఎస్ నాయకులు, జై కాంగ్రెస్ అంటూ అధికార పార్టీ నాయకులు నినాదాలు చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో బడిబాట ముగింపు సభ పూర్తి కాకుండానే అతిథులు మధ్యలోనే వెళ్లిపోయారు.

పదవులు లేనివారి పెత్తనం ఏమిటీ : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఎలాంటి పదవులు లేని కాంగ్రెస్ నాయకులు అధికారిక కార్యక్రమాల్లో పెత్తనం చెలాయించడం ఏమిటని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రశ్నించారు. కొల్చారంలో నూతన ఎంపీపీ కార్యాలయ భవనం ప్రారంభోత్సవంలో గత ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి గుమ్మడికాయ కొట్టడంపై సునీతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అయిన తనను కాదని ఓడిపోయిన అభ్యర్థికి మంత్రి కొండాసురేఖకు కత్తెర అందించి ఎలా రిబ్బన్ కట్ చేయించారు అని ప్రశ్నించారు. అలాగే ఎంపీపీ మంజుల తన చాంబర్‌లో రిబ్బన్ కట్ చేసేటప్పుడు ఎమ్మెల్యే సునీతారెడ్డి, జడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్‌ను కాదని మంత్రి కొండాసురేఖతో కాంగ్రెస్ నాయకులు ముందుకు వెళ్లిపోయారు. దీంతో ఎంపీపీ మంజుల అక్కడే నేలపై కూర్చుని నిరసన తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిపల్లి ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి ఆమెకు నచ్చజెప్పి ముందుకు తీసుకెళ్లారు.

కొల్చారం జడ్పీహెచ్ఎస్ బడిబాట ముగింపు లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్

పేదలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

■ విద్య సామాజిక అంతరాలను తగ్గిస్తుంది... ■ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
■ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ■ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, జూన్ 19: విద్యతో సామాజిక అంతరాలు తగ్గుతాయని పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కొల్చారంలో బడిబాట ముగింపు, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పేద విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. బడిబాట విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వసతులు, సదుపాయాలతో పాటు బోధనలో విప్లవాత్మక మార్పులు, చర్యలు చేపడుతున్నామన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఐదేండ్లు పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేల చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరేలా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు 90శాతం పూర్తయ్యాయని, వారంలోగా వంద శాతం పూర్తవుతాయన్నారు. అనంతరం కొల్చారం మండలంలో రూ.కోటి 20లక్షలతో నిర్మించనున్న ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. పోతన్‌శెట్టిపల్లి సమీపంలోని జూలగుట్ట వద్ద రూ.2లక్షల 50వేలతో నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవుల రాజిరెడ్డి, రెడ్డిపల్లి ఆంజనేయులు, సోమన్నగారి రవీందర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి, ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, విద్యాధికారి రాధాకిషన్, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, జడ్పీసీఈవో ఎల్ల య్య, జడ్పీటీసీ మేఘమాలసంతోశ్‌కుమార్, ఎంపీపీ మంజులాకాశీనాథ్, గౌరీ శంకర్‌గుప్తా, కోనాపూర్ సంతోశ్‌రావు, రాజాగౌడ్, నరేందర్‌రెడ్డి, బాగారెడ్డి, యాదాగౌడ్, రవితేజరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయలు

- ■ నెల రోజుల్లో అనూహ్యంగా పెరిగిన ధరలు
- ■ నాలుగు రెట్లు పెరిగిన టమాట
- ■ ఘాటెక్కిన పచ్చిమిర్చి
- ■ గతనెలలో ఉల్లి 30 నుంచి 40, ఇప్పుడు కిలో 70పైనే...
- ■ ఆకాశానికి నిచ్చనేసిన మిగతా కూరగాయలు
- ■ గతేడాదితో పోలిస్తే అధిక ధరలు

న్యాల్‌కల్, జూన్ 19: కూరగాయల ధరలు కొండెక్కాయి. కొనాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. నెల రోజుల్లో టమాట నాలుగు రెట్లు పెరగ్గా, మిగతా కూరలు 40నుంచి 50శాతం పెరిగాయి. పచ్చిమిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతున్నది. టమాట నేడోరేపో సెంచరీ కొట్టనున్నది. మేమేం తక్కువ అన్నట్టు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం డబుల్ అవడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మార్కెట్‌కు ఐదు వందల నోటుతో వెళ్తితే.. సగం సంచి కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో కిలో కొనేవారు, పావుకిలో సరిపెట్టుకుంటున్నారు. కూరగాయల సాగు తగ్గిపోవడం, వర్షాలతో తోటలు దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితికి కారణమని తెలుస్తుంది. మార్కెట్‌కు ఎక్కువగా దిగుబడి వస్తే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారులు అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంటే ఎంతో కొంత తక్కువ ధరలకు లభిస్తాయనుకుని రైతుబజారుల్లో సైతం ధరలు ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండించే రైతుకు ఎంత వరకు గిట్టుబాటు ధర లభిస్తోందో గానీ.. దళారులు మాత్రం బాగుపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కన్నీళ్లు తెప్పిస్తున్నాయి..

సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళ్తే పట్టుమని నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. పచ్చిమిర్చి ధర రూ.100-120 చేరి అందనంత ఎత్తులో ఉంది. జహీరాబాద్, బీదర్ పట్టణాల్లో కాకుండా మండలంలోని వారంతపు సంతలు, వీధి దుకాణాల్లో సైతం కూరగాయల ధరలు పెరిగిపోవడంతో వాటిని కొనలేని పరిస్థితి నెలకొంది. నెల రోజుల క్రితం టమోట ధర రూ.10 నుంచి 20 ఉండగా నేడు ఏకంగా రూ.70 నుంచి 90 వరకు చేరింది. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.25 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.60కి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బీరకాయ, గోరుచిక్కుడు, వంకాయ, కాకర కాయ, చిక్కుడు, బీట్‌రూట్, క్యారెట్, క్యాబేజీ, బీన్స్, ముల్లంగి తదితర కూరగాయల ధరలు రూ.80-100 మధ్య ఉండడంతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాడి ధరలు కూడా పెరిగిపోవడంతో కొనలేకపోతున్నారు. మెంతి, పాలకూర, చుక్క కూర, గోంగూర వంటివి కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. కూరగాయలు, ఆకుకూరల ధరల గురించి వ్యాపారులను అడిగితే పంటలు పండడం లేదనే సాకుతో మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయలు కొనాలంటేనే భయమేస్తోంది..



మార్కెట్‌లోనే కాదు.. వారాంతపు సంతలో కూడా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. వాటిని కొనాలంటేనే భయమేస్తోంది. గతంలో ఎప్పుడు లేని విధంగా వ్యాపారులు కూరగాయల ధరలు పెంచేశారు. ఏ కూరగాయలను కొని తినే పరిస్థితుల్లో లేం. నోటికి రుచికరంగా చేసుకుందా మంటే ధరలు మండిపోతున్నాయి. రూ.500 తీసుకుని వెళితే సగం సంచి కూడా నిండడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని నియంత్రించాలి.

- శంభునోల నర్సారెడ్డి, హద్నూర్, న్యాల్‌కల్ మండలం

ప్రియుడి ఇంటి ఎదుట నిరసన

అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో ప్రియుడు ఇంటి ఎదుట నిరసన చేస్తున్న ప్రియురాలు

దుబ్బాక, జూన్ 19: ప్రేమించి, పెండ్లి చేసుకుంటానని ఒట్టేసి లోబర్చుకుని ఇప్పుడు తప్పించుకుని తిరుగుతున్నాడంటూ ఓ మహిళ ప్రియుడి ఇంటి ఎదుట బంధువులు, గ్రామైక్య సంఘాల అండతో ధర్నాకు దిగింది. బాధిత మహిళ ఆమె బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లికి చెందిన పల్లె కవిత, అదే గ్రామానికి చెందిన పల్లె శ్రీకాంత్ ఎనిమిదేండ్లుగా ప్రేమించుకున్నారు. ఇటీవల పెండ్లి విషయం ప్రస్తావించగానే శ్రీకాంత్ ముఖం చాటేస్తున్నాడని కవిత ఆరోపించింది. ఈ విషయంపై గ్రామంలో నిర్వహించిన పంచాయితీలో సైతం పెండ్లి చేసుకుంటానని చెప్పిన శ్రీకాంత్ ఇప్పుడు పెండ్లికి నిరాకరిస్తున్నడని ఆవేదన వ్యక్తం చేసింది. శ్రీకాంత్ తల్లిదండ్రులే పెండ్లికి అడ్డు పడుతున్నారని ఆరోపించింది.

రెండేండ్ల కిందట పెండ్లి : రెండేండ్ల కిందట కవితను శ్రీకాంత్ సిద్దిపేటలోని ఓ గుడిలో పెండ్లి చేసుకున్నాడు. ఫొటో ఆధారాలను బాధితురాలి బంధువులు చూపించారు. పెండ్లి చేసుకున్న సమయంలో వారు మైనర్లుగా ఉన్నారని తెలిపారు. మేజర్లు అయిన తర్వాత పెండ్లి చేస్తామని చెప్పిన శ్రీకాంత్ తల్లిదండ్రులు ఇప్పుడు మాట మార్చారని కవిత ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం జరిగే వరకు శ్రీకాంత్ ఇంటి ఎదుట నుంచి కదలనని భీష్మించుకొని కూర్చింది. శ్రీకాంత్ తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి గ్రామం విడిచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మహిళా సంఘాలు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన ఘటనాస్థలానికి చేరుకుని కవితకు అండగా నిలిచి నిరసనలో పాల్గొన్నారు.